ప్రజాశక్తి
ఆదివారం 11 డిసెంబరు 2022 | 5 | శ్రీకాకుళం



రైతులకు వర్ష భయం

ఆమదాలవలస: తడిచిన వరి చేలు

సంతబొమ్మాళి: ధాన్యం ఎండబెడుతున్న రైతులు

జిల్లాపై మాండూస్ తుపాను ముప్పుతో రైతులు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం వేకువజాము వరకు చిరుజల్లులు కురిశాయి. శనివారం రాత్రి కూడా పలు చోట్ల వర్షం కురిసింది. ఈదురుగాలులతో చలి తీవ్రత పెరిగింది. మరో పక్క ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లుతుండగా, కోతకు వచ్చిన వరి పంట నేలకొరుగుతోంది. జిల్లాలో రెవెన్యూ వ్యవసాయ అధికారులు రైతులను అప్రమత్తం చేశారు. కోసిన పంటను కుప్పలు పెట్టుకోవాలని సూచించారు. తుపాను ధాటికి వీస్తున్న ఈదురుగాలులు ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. టమోటా, అరటి పంటలకు నష్టం వాటిల్లుతుంది. చాలా వరకు కోత దశలో పంటలున్నాయి. అక్కడక్కడవరి పంట నూర్పిడి దశలో ఉంది. మరి కొన్నిచోట్ల పంటను కోసి పొలాలలోనే ఉంచేశారు. చలి తీవ్రతకు యాచకులు, వలస కూలీలతో పాటు, గ్రామాల్లోని పశువులు వణికిపోతున్నాయి. పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని వర్షం, చలి నుంచి పశువులను కాపాడుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు.

(పూర్తి వార్త 6లో..)

గందరగోళంలో ఉపాధ్యాయులు

- బదిలీ ప్రక్రియకు ప్రభుత్వం పచ్చజెండా
- జిఒ 187ను సవరించాలి
- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయుల బదిలీకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపటంతో ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం వర్క్ అడ్జెస్ట్మెంట్ పేరుతో విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలకు సిద్ధమైంది. ఇప్పటికే పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఆ మేరకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం నెల రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని చెబుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తికి రెండు నెలల సమయం పట్టనుంది. విద్యా సంవత్సరం మధ్యలో కాకుండా ప్రథమార్థంలో బదిలీలు నిర్వహిస్తే మంచిదని పలు ఉపాధ్యాయ సంఘాలు సూచిస్తున్నాయి. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో బదిలీ ప్రక్రియపై చర్చించకుండా అర్ధరాత్రి వేళ ఉత్తర్వులు ఇవ్వటాన్నీ తప్పుపడుతున్నాయి. అలాగే ప్రభుత్వం జారీ చేసిన జిఒ 187లో సవరణలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 3 నుంచి 10వ తరగతులకు సబ్జెక్టు టీచర్లు అదనంగా అవసరమని విద్యాశాఖ అంచనా వేస్తోంది. అందుకోసం హెచ్ఎం గ్రేడ్-2 సహా ఎస్జిటి బదిలీల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. గతంలో ఉన్న తెలుగు, ఇంగ్లిష్ మీడియం వారీగా విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయ నియామకం జరిగింది. 65 మంది పిల్లల కంటే ఎక్కువగా విద్యార్థుల సంఖ్య ఉంటే అదనపు సెక్షన్లను మంజూరు చేశారు. జిల్లాలో 165 పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి వరకు తరగతులను కొనసాగిస్తున్నారు. మరో ప్యాటర్న్లో 6 నుంచి 10వ తరగతి వరకు హైస్కూళ్లు మాత్రమే కొనసాగుతున్నాయి. వీటిలో ఉపాధ్యాయుల సంఖ్యను బట్టి కాకుండా మీడియంల వారీగా ఇద్దరు గణితం, బయాలజీ, సోషల్, తెలుగు సబ్జెక్టులను బోధించే వారు. ఒకర హిందీ, మరోకరు ఫిజికల్ సైన్స్ను బోధించేవారు. కానీ ఇప్పుడు మీడియంల వారీగా కాకుండా విద్యార్థుల సంఖ్యను బట్టి బోధనా సిబ్బందిని నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ రూపకల్పన చేసింది. అందులో బాగంగా జిల్లాలో 400 మంది ఎస్జిటి ఉపాధ్యాయులు అదనంగా ఉన్నట్లు లెక్కలు చూపుతున్నారు. మిగుల పోస్టుల పేరిట హేతు బద్ధీకరణకు చర్యలు మొదలుపెట్టారు. 2022-23 విద్యా సంవత్సరం ఒడిదొడుకులకు లోనుకాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అందులో భాగంగానే ఈనెల 12 నుంచి జనవరి 12 వరకూ నెలరోజుల పాటు బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు మార్గ దర్శకాలు విడుదల చేసింది. జెడ్పి, ఎంపిపి పాఠశాలల్లోని గ్రేడ్-2 హెడ్మాస్టర్ల సర్వీసు కనీసం ఐదు ఏళ్లు ఉండాలని ప్రభుత్వం నిబంధనల్లో పేర్కొంది. బదిలీల ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులు కోరుకున్న చోటును ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం వెబ్ కౌన్సిలింగ్ ద్వారా పాఠశాల విద్యాశాఖ బదిలీలు నిర్వహించనున్నట్లు మార్గ దర్శకాల్లో స్పష్టం చేసింది.

అన్ని ఖాళీలను భర్తీ చేయాలి

రేషనలైజేషన్ అయిన అందరికీ పాత పాయింట్లు కేటాయించాలి. యూనియన్ల జిల్లా, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకూ పాయింట్లు ఇవ్వాలి. ఖాళీలు చూపించేటప్పుడు ఏ ఒక్క ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్నింటినీ చూపించాలి. గతంలో మాదిరిగా వికలాంగులు, ఇతర సర్వీసుల వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. బదిలీ ప్రక్రియపై ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొంది. ఉపాధ్యాయుల అభ్యంతరాలను స్వీకరించి, జిఒలో మార్పులు చేశాక ఈ ప్రక్రియ చేపట్టాలి.

-ఎస్.కిషోర్కుమార్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పాత పద్ధతికి భిన్నంగా బదిలీలు

జిఒ 187లో పాత పద్ధతికి భిన్నంగా అంశాలను పొందుపరిచారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అన్నింటినీ చూపించాలి. ఎనిమిదేళ్లలో రేషనలైజేషన్కు గురైన ప్రతి ఉపాధ్యాయునికి ఐదు పాయింట్లు ఇవ్వాలి. కేవలం 2020లో బదిలీ పొంది, మెర్జింగ్ పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే పాయింట్లు ఇవ్వడం సరికాదు. 2021 అక్టోబర్ తర్వాత ఉద్యోగోన్నతి పొందిన వారికి బదిలీ తప్పనిసరి చేయడం సరికాదు.

-మజ్జి మదన్మోహన్, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

మోకాళ్లపై కూర్చొని ధర్నా చేస్తున్న టోల్ ప్లాజా సిబ్బంది

టోల్ప్లాజా కార్మికులను ఆదుకోవాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు
- మోకాళ్లపై కూర్చొని ధర్నా

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

చిలకపాలెం టోల్ ప్లాజా కార్మికులకు ఉపాధి భద్రత కల్పించి, ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. టోల్ ప్లాజా కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ చిలకపాలెం టోల్ప్లాజా వద్ద కార్మికులతో మోకాళ్లపై కూర్చొని శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ చిలకపాలెం టోల్ ప్లాజా ఎత్తివేసిన కారణంగా నాతవలస, మడపాం టోల్ ప్లాజాల్లో టోల్ రుసుంను పెంచి ఆదాయం తగ్గకుండా సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు అదే విధంగా రోడ్డునపడ్డ 15ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను సర్దుబాటు చేయాలని, లేనిపక్షంలో తగిన పరిహారం చెల్లించాలని, వెంటనే యూనియన్తో చర్చించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వారికి గ్రాట్యూటీ, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్డున పడ్డ కార్మికులను ఆదుకోవాలని, కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హైవే పీడీని కలిసి, విన్నవించామని తెలిపారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కార్మికులను డిసెంబర్ 7వ తేదీ అర్ధరాత్రి 12గంటలకు నిలుపుదల చేస్తున్నామని చెప్పడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సైనికుల కోసం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అర్ధాంతరంగా నిలుపుదల చేస్తే వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. కార్మికులకు ఉపాధి లేకపోతే ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతారని వాపోయారు. జిల్లా అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు దశల వారీగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో చిలకపాలెం టోల్ ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి.నర్సింహులు, ఎం.శంకరనారాయణ, ఎ.వి.ఆర్.మూర్తి, ఎస్.మురళీధర్, బి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విచారణలో ఏం తేలుస్తారో?

- ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖపై మరోసారి దర్యాప్తు
- జిల్లాకు రానున్న ఉన్నత స్థాయి కమిటీ
- రెండు రోజుల పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విచారణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పి.సురేఖ

శ్రీకాకుళం నగరంలోని పభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖపై మరోసారి విచారణ చేపట్టేందుకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగుతున్నారు. గతంలో రెండు పర్యాయాలు ఈమెపై కళాశాల విద్యాశాఖధికారులు విచారణ చేశారు. అధ్యాపకులు, సిబ్బంది ఫిర్యాదుపై ఈ ఏడాది అక్టోబర్లో ఒకసారి దర్యాప్తు నిర్వహించగా విద్యార్థితో స్పాట్ వాల్యుయేషన్ చేయించిన ఘటనపై గత నెల విచారణ చేపట్టారు. తాజాగా డిగ్రీ సెమిస్టర్ పరీక్షల సమయంలో ప్రిన్సిపాల్ సురేఖ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, యూనివర్సిటీ అధికారుల ఉత్తర్వులను బేఖాతరు చేశారన్న ఆరోపణపై విచారణ చేపట్టేందుకు ఉన్నత స్థాయి విచారణ కమిటీ ఎంక్వయిరీ చేపట్టనుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖపై వివిధ సందర్భాల్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. యూనివర్సిటీ అధికారులతో పాటు కళాశాలకు చెందిన పలువురు అధ్యాపకులు ఆమెపై పలు ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది అక్టోబర్లో బిఇడి సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ అడ్డయ్య అక్టోబరు ఐదో తేదీన కళాశాలకు పరిశీలకులుగా వచ్చారు. ఆ సమయంలో ప్రిన్సిపాల్ సురేఖ అక్కడ లేనట్లు గుర్తించారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఏ రోజూ సమయపాలన పాటించలేదని పలువురు అధ్యాపకులు పరిశీలకులకు చెప్పారు. మేలో నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్లో చోటు చేసుకున్న అక్రమాలపైనా కళాశాల అధ్యాపకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పాటు శ్రీకాకుళం నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఆగస్టులో చేపట్టిన ఆరో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్ విషయంలో యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేశారన్న అంశంపైనా విచారణ సాగించనున్నారు. స్పాట్ వాల్యుయేషన్కు సిబ్బందిని రిలీజ్ చేయకపోవడం, స్పాట్ వాల్యుయేషన్ సమయంలోనే అధ్యాపకులతో సమావేశం నిర్వహించి స్పాట్కు వెళ్లనీయకుండా అవాంతరాలు కల్పించారంటూ అటు అధ్యాపకులూ ఫిర్యాదు చేశారు. సెలవులు మంజూరు, దూషణలకు పాల్పడటం, మహిళా అధ్యాపకులను సైతం వేధించడం వంటి చర్యలపై అధ్యాపకులు చేసిన ఫిర్యాదుపైనా విచారణ సాగించనున్నారు. ఈ నేపథ్యంలోనే కమిటీ ఈ నెల 12, 13 తేదీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనుంది. అధ్యాపకులతో విడివిడిగా మాట్లాడి ఆరోపణలపై నిగ్గు తేల్చనుంది. వీటిపైనా విచారణ కమిటీ దర్యాప్తు చేపట్టనుంది.

అధ్యాపకులకు ఫోన్లలో బెదిరింపులు

విచారణ కమిటీ వస్తున్న నేపథ్యంలో బోధన, బోధనేతర సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, ఎవరికి ఎటువంటి సెలవులు మంజూరు చేయడం జరగదని ప్రిన్సిపాల్ సురేఖ ఈ నెల 7వ తేదీన ఒక సర్క్యులర్ను జారీ చేశారు. విచారణ నేపథ్యంలో అధ్యాపకులపై బెదిరింపు ఫోన్కాల్స్ వస్తున్నట్లు తెలిసింది. ఈ అంశాన్ని విచారణ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని పలువురు అధ్యాపకులు చెప్తున్నారు. దీంతో పాటు విచారణలో ప్రిన్సిపాల్కు వ్యతిరేకంగా చెప్తే సర్వీస్ రిజిస్ట్రర్లో రిమార్కులు రాస్తామంటూ వాట్సప్లో వస్తున్నట్లు పలువురు అధ్యాపకులు ఆరోపిస్తున్నారు.

అటకెక్కుతున్న విచారణ నివేదికలు

ప్రిన్సిపాల్ సురేఖపై ఇప్పటికే రెండు పర్యాయాలు విచారణ జరిగింది. అధ్యాపకులు, సిబ్బంది ఫిర్యాదుపై ఈ ఏడాది అక్టోబర్లో ఒకసారి దర్యాప్తు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సురేఖ తీరు, తాము పడుతున్న ఇబ్బందులపై అధ్యాపకులంతా ఆర్జెడి కృష్ణ ముందు చెప్పారు. ఆ తర్వాత సెమిస్టర్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ సమయంలో విద్యార్థితో స్పాట్ వాల్యుయేషన్ చేయించిన ఘటనపై గత నెల విచారణ చేపట్టారు. దానిపై విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఆర్జెడి కార్యాలయం నుంచి వచ్చిన ఒక సూపరింటెండెంట్ విచారణ చేపట్టారు. ఆ విచారణకూ అతీగతి లేకుండా పోయింది. విచారణ తప్ప చర్యలు లేకపోవడంపై పలువురు అధ్యాపకులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల్లో ఎవరో ఒకరు ప్రిన్సిపాల్ సురేఖపై చర్యలు చేపట్టకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. మూడోసారైనా నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని అధ్యాపకులు కోరుతున్నారు.



విచారణ కమిటీ పర్యటనపై ప్రిన్సిపాల్ జారీ చేసిన సర్క్యులర్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

జెసి నవీన్

రైతులతో మాట్లాడుతున్న జెసి నవీన్

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నపాలెంలోని సోమలమ్మ మోడరన్ రైస్మిల్లు వద్ద అప్పుడే వచ్చిన ధాన్యం లోడ్, రశీదు వివరాలు పరిశీలించారు. అనంతరం హిరమండలం మండలం గొట్ట, చిర్లంగి గ్రామాల్లో వరి కప్పలను పరిశీలించారు. రైతుతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై మాట్లాడి, వారి అనుమానాలు నివృత్తి చేశారు. అనంతం పాతపట్నం మండలం కొరసవాడ గ్రామంలో రైతులతో మాట్లాడారు. దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతులకు ఏటువంటి సమస్య లేకుండా ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జెసి వెంట పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, మండల, గ్రామ వ్యవసాయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర గ్యారంటీకి చట్టం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జెండాను ఆవిష్కరిస్తున్న నందోడు

రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతుధర గ్యారంటీకి చట్టం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అన్నారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభల సందర్భంగా శనివారం ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో రైతు సంఘం జెండాను తోనంగి నందోడు ఆవిష్కరించారు. అనంతరం రైతు సంఘం ఎచ్చెర్ల మండల కార్యదర్శి పొందూరు చంద్రరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయాన్ని కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోందన్నారు. అందులో భాగంగా తీసుకువచ్చిన మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో 13 నెలలు రైతులు చేసిన వీరోచిత పోరాటాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ పోరాట స్ఫూర్తితో భూమి కోసం, పంటల మద్దతుధరల కోసం, సాగునీటి ప్రాజెక్టుల కోసం రైతాంగ పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13 నుంచి 16 వరకు కేరళ రాష్ట్రం తిరుచూరులో జరుగుతున్న అఖిల భారత 35వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుట్టా కైలాష్, కోరాడ అప్పన్న, జర్జాపు సీతారాం, బుచ్చిరాజు, తొనంగి రమణమ్మ, కోరాడ రాజేశ్వరి, టి.అనురాధ, టి.అసిరమ్మ, పి.పార్వతి, అర్.వెంకన్న, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

హంగులు తప్ప అభివృద్ధి శూన్యం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - బూర్జ

ర్యాలీగా వెళ్తున్న టిడిపి నాయకులు

వైసిపి ప్రభుత్వంలో హంగులు తప్ప, అభివృద్ధి శూన్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని తుడ్డలి గ్రామంలో శనివారం 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మూడున్నరేళ్ల పాలనలో రాష్ట్రానికి ఏం చేశారని ప్రజలను రప్పించి సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. బిసిలకు ఏం చేశారని బిసి గర్జన సభ నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం ప్రజలపై భారాలను మోపుతోందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు అభివృద్ధి వైపు అడుగులు వేస్తే.. జగన్ కూలగొట్టడంతోనే పాలన ప్రారంభించారన్నారు. ప్రజలు టిడిపి అధికారంలోకి రావాలని బలంగా కోరుకుంటున్నారని అన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కె.అప్పలస్వామిని పరామర్శించారు. ఆయన ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నారు కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వి.రాంజీ, సర్పంచ్ ఎం.రూపవతి, గణపతిరావు, లంకజగన్నాథం, కె.కృష్ణ బెనర్జీ, రాంబాబు, బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నంనాయుడు, అప్పలపేట సర్పంచ్ కొరికిన సీతారామరాజు, గోపి, రామకృష్ణ, నారాయణరావు. ఆదినారాయణ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల పాట్లు పట్టవా?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ధాన్యం కొనుగోళ్లలో ఈ సారి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పద్ధతులు సేకరణను ప్రభుత్వ సంక్లిష్టం చేశాయి. ధాన్యం సేకరణలో అవకతవకలను కట్టడి చేసేందుకే మార్పులు తీసుకొచ్చామని ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో రైతులకే ఇబ్బంది పెట్టేలా కనిపిస్తున్నాయి. కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడులో ఈ నెల తొమ్మిదో తేదీన చోటు చేసుకున్న ఘటనే అందుకు ఉదాహరణ. కన్నేవలసకు చెందిన ఆదినారయణ అనే రైతుకు చెందిన ధాన్యం వేబ్రిడ్జిలో 4.120 టన్నుల తూకం ఉంటే, ఆర్బికెలో ఇచ్చిన షెడ్యూల్ 3 టన్నులకుపైగా ఉండటంతో ట్రాక్షీట్ జనరేట్ కాని పరిస్థితి నెలకొంది. సాంకేతిక సమస్యలు రైతులకు ఇబ్బందిగా పరిణమించాయి. తేమ శాతం 17 శాతానికి మించి ఉంటే ఆరబెట్టి తీసుకురావాలంటూ ధాన్యాన్ని వెనక్కి పంపిస్తున్నారు. నరసన్నపేటకు చెందిన చినకరగాం గ్రామానికి చెందిన గొండు అప్పారావు ధాన్యం నూర్పిడి చేసి రెండు రోజులు గడుస్తున్నా తేమశాతం తేడాతో ధాన్యం కొనలేదు. దీంతో రహదారిపై ఆరబెడుతున్నారు. మరో పక్క మాండూస్ తుపాను ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల కురిసిన తేలికపాటు జల్లులు రైతులను కలవరపెడుతున్నాయి. ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చేందుకు సిద్ధం చేసిన బస్తాలపై పరదాలను కప్పుతూ పంటను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.

జిల్లాలో గత నెల 24వ తేదీన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినా ఇప్పటికీ మందకొడిగానే సాగుతున్నాయి. నవంబర్ నెలఖారులో వచ్చిన అల్పపీడనం రైతులను ఆందోళనకు గురిచేయగా గత రెండు మూడు రోజులుగా తుపాను రైతులను కలవరం పెట్టిస్తోంది. అయినా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసే పనిని అధికారులూ చూడటం లేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులకూ శ్రద్ధ లేదు. ఫలితంగా ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నా కొనుగోళ్ల కేంద్రాల్లో అందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు ఏవీ కనిపించడం లేదు. జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల తీరే అందుకు ఉదాహరణ. జిల్లాలో 272 కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు 152 చోట్లే ప్రారంభించారు. రైతుల నుంచి సుమారు 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించగా కేంద్రాలు ప్రారంభించి రెండు వారాలు పూర్తయినా ఇప్పటివరకు 5,421 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించగలిగారు. ప్రభుత్వం ఈ సారి ఫోర్టిఫైడ్ నాన్ సార్టెక్స్ బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వం తీసుకుంటామని చెప్పడంతో ఆ మేరకు మెషినరీని మిల్లర్లు సమకూర్చులేకపోయారు. దీంతో 160 మిల్లులే యంత్ర సామాగ్రిని ఏర్పాటు చేసుకోవడంతో అక్కడే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మిల్లర్లూ పూర్తి స్థాయిలో ధాన్యం సేకరణకు సిద్ధం కాలేదు. కొనుగోలు సిబ్బంది నియామకం, ఇతర సాంకేతిక సమస్యలూ వెంటాడుతున్నాయి.

ధాన్యం కొనుగోళ్లు సకాలంలో జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులెవెరూ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పిఎసిఎస్, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పిలిస్తే కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రిబ్బన్ కటింగ్ మాత్రం చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ఇబ్బందులేమిటన్న విషయంపై జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకూ తీరిక లేకుంది. అధికారులతో ఇప్పటివరకు కనీసం సమీక్షా సమావేశం నిర్వహించలేదు. ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతుంటే అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు జయహో బిసి గర్జన అంటూ విజయవాడకు బయలు దేరారు. బిసిలకు ఈ మూడేళ్ల కాలంలో వైసిపి ఏం చేసిందో ఏర్పాటు చేసిన సభకు ఆర్టిసి బస్సుల్లో తరలివెళ్లారు. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్న చందంగా ప్రభుత్వం, పార్టీ ప్రచారం కోసం ఆర్టిసి బస్సులను మళ్లించడం పరిపాటిగా మారింది. ఆర్టిసి బస్సులను ప్రభుత్వం, పార్టీ కార్యక్రమాలకు వాడుకోవడం పాలక పార్టీలకు సర్వసాధారణమైంది. వైసిపి ప్రభుత్వంలో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తోంది. 15 రోజుల వ్యవధిలో మూడు సార్లు వందకు పైగా బస్సులను సభలకు వినియోగించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల కోసం గంటల తరబడి పిల్లలు, వృద్ధులతో వేచి చూసి అవస్థలకు గురయ్యారు. ఇదే సమయంలో ప్రయివేట్ బస్సుల జోలికి వైసిపి నాయకులు వెళ్లకపోవడంతో వాటికి పెద్దగా ఇబ్బంది కనిపించలేదు. కిక్కిరిసిన ప్రయాణికులతో తిరుగుతూ ఆర్టిసికి రావాల్సిన ఆదాయమంతా వారికి చేరింది.

ప్రజా సమస్యలు, జనం ఇబ్బందులపై పోరాడి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాల్సిన టిడిపి పాలక పక్షం చేస్తున్న కార్యక్రమాలకు కౌంటర్లు ఇచ్చేందుకే సమయం వెచ్చిస్తోంది. ధాన్యం కొనుగోళ్లపై వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వేగవంతం చేయొచ్చు. కానీ టిడిపి ఆ పని చేయడం లేదు. వైసిపి బిసి జపం చేస్తుంటే, ఎక్కడ వెనుకబడిపోతామోనని టిడిపి అదే అంశంపై పోరాడింది. బిసిల సమస్యలపై కలెక్టర్ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి తదితర టిడిపి నాయకులు పయత్నించడంతో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. బిసిలను తామే ఉద్ధరించామంటూ ఇరు పార్టీలు గొప్పలు చెప్పుకుంటూనే వెనుకబడిన తరగతులకు చేసిన అన్యాయంపై పరస్పరం విమర్శలు గుప్పించుకున్నాయి. టిడిపి హయంలో బిసిలకు కత్తెర్లు, ఇస్త్రీ పెట్టెలే ఇచ్చారంటూ వైసిపి నాయకులు విమర్శిస్తుంటే, జగన్ ప్రభుత్వం బిసిలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వేటికీ నిధులివ్వలేదంటూ టిడిపి నాయకులు ఎదురుదాడి చేశారు. రెండు పార్టీలూ బిసిలను స్మరిస్తూ, ప్రజలు, రైతుల సమస్యలను విస్మరించాయి. బిసిలకు, ఇతర సామాజిక తరగతులకు, సామాన్య జనానికి ఎవరేం చేశారో ప్రజలు నిరంతరం గమనిస్తూనే ఉంటారు. సరైన సమయంలో బుద్ధి చెప్పనున్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
O.S. 42 /2022

Between: **Naram Muralidar Tilak** --Plaintiff
And: **Naram Roop Kumar** and others --Defendants

To,
1. Naram Roop Kumar S/o Late Venkata Rao, **D1**
2. Naram Promod Kumar S/o Late Venkata Rao, **D2**
Residing at Door No. 14-10-37/2, Old Housing Board Colony, Srikakulam Town and District.

పై కోర్ట్ లో పై నెంబరు దావాని వాది దాఖలు చేసుకుని, మీకు అనేక సార్లు కోర్టు నుండి నోటీ సులు పంపినను, మీరు తీసుకొనక కాలయాపన చేయు టవలన ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియచేయినది ఏమనగా పై కోర్టు వారి అర్డరు ప్రకారం మీరు **తే.14.12.2022 దిన ఉదయం గం. 10-30 ని॥** లకు మీరు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారాగాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలియజేసు కొనగలరు. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమునందు తీర్మానించగలరని ఇందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేది : 14.12.2022

Sri U.NagaManiKumar,
Advocate,Srikakulam.
Cell-9440372477

దీక్ష చేస్తున్న కార్మికులు

వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పలాస

రైస్ మిల్లు కార్మికుల వేతన సవరణ తక్షణమే చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.దుర్యోధన, కె.బాలకృష్ణ డిమాండ్ చేశారు. మందస మండలం ఆర్.కె.పురం పరిధిలోని రైస్‌మిల్లుల ఆవరణలో రైస్ మిల్లు కార్మికుల నిరవధిక దీక్షను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి పీసు రెట్లు, వేతనాలు రైస్ మిల్లు యాజమాన్యాలు చెల్లించడం లేదని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన రీతిలో స్పందించడం లేదన్నారు. దీంతో మిల్లు యాజమాన్యం మొండిగా వ్యవహరించి చర్చలు ముందుకు సాగనీయడం లేదన్నారు. బోనస్‌లు, ఇఎస్ఐ, పిఎఫ్, డిఎలు వంటి చట్టపరంగా అమలు కావాల్సిన సౌకర్యాలను ఎగనామం పెట్టి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వాల విధానాల కారణంగా ధరలు పెరిగిపోతున్నాయని. దీంతో కార్మికవర్గం తీవ్రంగా నష్టోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, మండల కన్వీనర్ కె.కేశవరావు మాట్లాడుతూ అధికారులు జోక్యం చేసుకొని సంప్రదాయ ఒప్పందం ప్రకారం కార్మికులకు న్యాయంగా రావాల్సిన వేతనాలు చెల్లించాలన్నారు. లేని ఎడలా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎస్.గురునాథం పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు కార్మికుల సంఘం నాయకులు పి.కూర్మారావు, ఆర్.ఏకాశి, ఎం.ధర్మారావు, తులసీరావు, ఎన్.లచ్చయ్య, బి.వెంకటేశం, జయరామ్, బౌందేవు, బి.లచ్చయ్య, బి.పోలయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - కొత్తూరు

గ్రామ రెవెన్యూ అధికారులు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములకు సంబంధించిన మ్యుటేషన్, స్పందన ఫిర్యాదులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. భూ రీ సర్వే వేగవంతం చేయాలని సూచించారు. సర్వే చేసే సమయంలో రైతు పేరు, సర్వే నంబరు పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి పట్టాదారు పాస్ పుస్తకం అందజేయాలన్నారు. పనితీరు సక్రమంగా లేనందున నివగాం విఆర్‌ఒకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. అనంతరం మెట్టూరు పిహెచ్‌సికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అలాగే స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేసుల పరిష్కారానికి ఎస్ఐ ఎం.గోవింద్‌ను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో తహశీల్దార్ పి.బాల, ఆర్ఐ వెంకటరావు, సర్వేయర్ రమణయ్య పాల్గొన్నారు.

రైతులకు వర్ష భయం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కాపాడుకోవడానికి రైతన్నలు పడుతున్న పాట్లు అంతా ఇంతా కాదు. తుపాను కారణంగా మూడు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులకు రైతులు ఆందోళన చెందుతున్నారు. మాండూస్ తుపాను ప్రభావం తమపై పడుతుందనే భయంతో రైతులు ముందొస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. పంట పొలాల్లో కోతలు నిలిపివేశారు. కోసిన వారి కంకిలను పొలాల్లో చిన్నచిన్న కుప్పలుగా పెట్టీ జాగ్రత్త చేశారు. శనివారం వేకువజామున అక్కడక్కడ చిరు జల్లులు పడటంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది. వాతావరణ మార్పులు గాలి వీచడం అధికం కావడంతో అకస్మాత్తుగా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందనే భావనతో సీతాపురం, బొద్దపాడు, గోవిందపురం, బెండి తదితర గ్రామాల రైతులు పంటను రక్షించుకోవాలని తాపత్రయంతో వరి కుప్పలపై టార్పాలిన్లను కప్పే పనిలో ముమ్మరంగా నిమగ్నమయ్యారు. ఉదయం 8 గంటల తరువాత వర్షం నిలిచిపోవడంతో రైతులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు. సీతాపురంలో కౌలు రైతు త్రినాథరావు తన పంటను కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. టార్పాలిన్లు లేని కౌల రైతులు చిన్న రైతులు ప్లాస్టిక్ గోని సంచులు, సిమెంట్ చిన్నచిన్న పర్ధా ముక్కలతో పంటను కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు అన్నదాతల కష్టానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

వజ్రపుకొత్తూరు : వరి కుప్పపై టార్పాలిన్‌ను వేస్తున్న రైతు

మెళియాపుట్టి : రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

మెళియాపుట్టి: తుపాను దృష్ట్యా వరి పంట కోతలు వాయిదా వేసుకోవాలని తహశీల్దార్ పి.సరోజిని, ఎఒ దానకర్ణుడు రైతులకు సూచించారు. మండలంలోని మర్రిపాడు-సి పంచాయతీ లింగుపురంలో రైతులతో శనివారం మాట్లాడారు. తుపాను ప్రభావం వల్ల ఆకాశం మేఘావృతమై ఉందని, రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. ధాన్యం బస్తాలు, వరి కుప్పలను తడిసిపోకుండా ఉండడానికి టార్పాలిన్లను కప్పుకోవాలని సూచించారు. వరి కుప్పలు, ధాన్యం బస్తాలు సురక్షిత ప్రాంతాల్లో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వైకుంఠరావు, విఆర్‌ఒ, గ్రామ వ్యవసాయ సహాయకులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే సంరక్షణ

జలుమూరు: వ్యవసాయ అధికారుల సూచనలు పాటించినట్లయితే వరి ధాన్యాన్ని సులభంగా సంరక్షించుకోవచ్చని ఎఒ కె.సురేష్ అన్నారు. మండలంలోని కరవంజ, పోగోడు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతుల కల్లాల వద్దకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తుపాను వల్ల ధాన్యం తడిచిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈయనతో పాటు సిఎస్‌డిటి గణేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

ఇచ్ఛాపురం : తుపాను కారణంగా వ్యవసాయ పనులను వాయిదా వేయాలని ఎఒ శ్రీదేవి సూచించారు. మండలంలోని 8,729 ఎకరాల్లో వరిసాగు అవుతుందని పేర్కొన్నారు. వరి కోసిన పంటలను రైతులు కాపాడుకోవాలని సూచించారు. తడిచిన పనాలు ఉంటే అరబెట్టుకుంటే నాణ్యత పోదని అన్నారు.

ఆమదాలవలస : రానున్న రెండు రోజులు వర్ష సూచన ఉన్నందున రైతులందరూ వరి పంట కోతలు వాయిదా వేసుకోవాలని ఎఒ మెట్ట మోహనరావు రైతులకు సూచించారు. ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ తడిచిన వరి పణలపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేయాలన్నారు. దీంతో వరి గింజలు రంగు మారకుండ, మొలకెత్తకుండ ఉంటాయని తెలిపారు.

బూర్జ : తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని ఉప్పినివలస, సింగన్నపాలెం, బూర్జ గ్రామాల్లో కళ్లాల్లోకి వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. కోతలు, కోతలు, మొత్తలు, నూర్పులు తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు.

జలుమూరు : సూచనలు ఇస్తున్న ఎఒ సురేష్

వసతిగృహానికి తాగునీటి కల్పన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని వావిపల్లిపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాల వసతి గృహానికి తాగునీరు కల్పనకు పైప్‌లైన్ ఏర్పాట్ల పనులను శనివారం చేపట్టారు. గత నెల 18న 'పొందూరు ఆదర్శ పాఠశాలలో దాహం కేకలు' అంటూ ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదర్శ పాఠశాలకు, వసతిగృహానికి అవసరమైన తాగునీరు కల్పనకు సమీపంలోని అప్పయ్య చెరువు వద్ద రెండు తాగునీటి మోటారు బోర్లు ఏర్పాటు చేసి అక్కడి నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. కాగా గతేడాది రహదారి ఏర్పాటుకు ప్రొజెక్లయినర్‌తో పనులు చేస్తుండగా వసతిగృహానికి తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్ పూర్తిగా పాడైపోయింది. దీంతో వసతిగృహానికి తాగునీరు సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి ఆదర్శ పాఠశాలలో 660 మంది విద్యార్థులకు, వసతిగృహానికి ఒక్కటే తాగునీటి మోటారు బోరు ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదనను వ్యక్తం చేసారు. దీనిపై స్థానిక సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు స్పందించి పంచాయతీ నిధులతో వసతిగృహానికి తాగునీరు సరఫరా చేసేందుకు అవసరమైన పైపులైన్లను ఏర్పాటు చేసేందుకు శనివారం ప్రొక్లెయినర్‌తో పనులను ప్రారంభించారు. వసతిగృహానికి తాగునీరు సరఫరాకు చర్యలు చేపట్టడంపై విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈయనతో పాటు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకరరావు, సిబ్బంది ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న గిరిబాబు

జయప్రకాష్‌కు నివాళి

ప్రజాశక్తి - పొందూరు

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలోను, ఉపాధ్యాయ ఉద్యమాల్లోను చురుకైన పాత్ర పోషించిన పైడి జయప్రకాష్ మాస్టర్ ఎందరో మన్నలను పొందారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని కింతలిలో యుటిఎఫ్ ఆధ్వర్యాన పైడి జయప్రకాష్ సంతాపసభను శనివారం నిర్వహించారు. ముందుగా జయప్రకాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మండలంలోని వి.ఆర్.గూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 గురుగుబెల్లి శ్యామలరావు, కింతలి జెడ్‌పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం బుడుమూరు గోవిందరావు, వి.ఆర్.గూడెం ఎంపియుపి హెచ్‌ఎం పైడి రంగారావు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.వి.శ్రీరామ్మూర్తి, మండల గౌరవ అధ్యక్షులు జి.మధుబాబు, వి.రాజారావు, గండెం రామారావు, జి.భాస్కరరావు, ఎపిటిఎఫ్ నాయకులు దుంపల శ్రీనివాసరాను, నర్సింహరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పారావు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

పొందూరు : వాండ్రంగి రైల్వే గేటు మధ్యలో రైలు ఢీకొని శనివారం జి.సిగడాం మండలం నిద్దాంకు చెందిన ఎర్నేన రామారావు (39) మృతి చెందారు. జిఆర్‌పి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మధ్యాహ్నం పట్టాలు దాటుతున్న సమయంలో విశాఖపట్నం నుంచి పలాస వెపు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తుపట్టారని, మృతుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. మృతుని భార్య రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని జిఆర్‌పి ఎస్ఐ ఎస్.కె.షరీఫ్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి...

కొత్తూరు : మన్యం పార్వతీపురం జిల్లా భామిని మండలం చిన్నదిమిలికి చెందిన వాడవలస శ్యామ్ సుందరరావు (38) కొత్తూరు మండలం కర్లెమ్మ పంచాయతీ బడిగాంకు వెళ్లే రోడ్డులో సంభవించిన ప్రమాదంలో ఇటీవల గాయపడ్డాడు. కొత్తూరులోని దుకాణంలో పనిచేస్తూ... బైక్ ఇంటికి వెళ్తుండగా... ఈ ప్రమాదంలో చోటు చేసుకుంది. వెంటనే స్థానికులు కొత్తూరు సామాజిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా... పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య దీప్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గోవింద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఇద్దరు అరెస్టు

సంతబొమ్మాళి : మండలంలోని ఉమిలాడలో వంక లక్ష్మి ఇంట్లో బంగారం, నగదు చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ కె.మధుసూదనరావు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మి అక్టోబరు 3న ఇంటికి తాళం వేసి చత్తీస్‌గడ్ రాష్ట్రానికి ఓ శుభ కార్యక్రమానికి వెళ్లిందన్నారు. తిరిగి ఈ నెల 9న ఇంటికి వచ్చి చూడగా... బీరువాలోని ఆరు తులాల బంగార వస్తువులు, రూ.పది వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించిందన్నారు. ఈ మేరకు ఆమె ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు నిర్వహించామన్నారు. ఇద్దరు నిందితులు నెల్లూరులో ఉన్నారని సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి తీసుకొచ్చామని, వారిని బాలల సంరక్షణ కేంద్రానికి పంపించామని తెలిపారు.

వాలంటీర్లపై విష ప్రచారం తగదు

ప్రజాశక్తి - ఆమదాలవలస

చింతాడ రవి

నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్న వాలంటీర్లపై టిడిపి నాయకులు విష ప్రచారం చేయడం తగదని వైసిపి నాయకులు చింతాడ రవి కుమార్ అన్నారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. చిత్తశుద్ధితో వాలంటీర్లు ప్రజలకు సేవలు చేస్తున్నారని అన్నారు. నామమాత్రపు గౌరవ వేతనంతో ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి సేవ చేస్తూ సమాజంపై గల నిబద్ధతను వాలంటీర్లు చాటుకుంటు న్నారని అన్నారు. కరోనా సమయంలో అందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని పేర్కొన్నారు. సమావేశంలో చిగురుపల్లి రవికుమార్, కెప్టెన్ పైడి రామారావు, చింతాడ రాఘవేంద్రరావు, కుప్పిశెట్టి కోటేశ్వరరావు, బుడుమూరు రామ్మోహనరావు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

పొందూరు: మండలంలోని వి.ఆర్.గూడెంలో దోమల నివారణ చర్యలను శనివారం సర్పంచ్ సువ్వారి అమ్మాయమ్మ ఆధ్వర్యాన చేపట్టారు. గ్రామంలోని కాలువల్లోను, అపారిశుధ్య ప్రాంతాల్లో దోమలను నివారించేందుకు ఎబెట్ రసాయనం ద్రావణాన్ని పిచికారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు, ఉప సర్పంచ్ ప్రతినిధి సువ్వారి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జలుమూరు: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని గొటివాడ పంచాయతీ మహమ్మద్‌పురంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందడంలో జాప్యం జరిగితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, మండల వైసిపి కన్వీనర్ మొజ్జాడ శ్యామలరావు, దరివాడ సర్పంచ్ పైడి విట్టల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - సోంపేట

స్థానిక సంస్కార భారతి విద్యా సంస్థల్లో శనివారం విజయవాడకు చెందిన నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ వారి ఆధ్వర్యాన శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 18 అంశాలపై ట్రైనర్ షేక్ మస్తాన్ విద్యార్థులకు వివరించారు. అనంతరం పరీక్ష నిర్వహించి అందులో మంచి ప్రతి చూపిన వారికి ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.దాసు, డైరెక్టర్ శ్రీనుబాబు, ప్రిన్సిపాల్ బి.రామ్మూర్తి, ఎఒ వి.పాపారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలను అందజేస్తున్న దాసు

కేబుల్ ఆపరేటర్లను ఆదుకోవాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

శ్రీకాకుళం అర్బన్ : ఇంటింటికీ ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించడానికి ఏర్పాటు చేసిన ఎపిఎస్ఎఫ్ఎల్ సంస్థ పరిధిలో ఆపరేటర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి కేబుల్ ఆపరేటర్ల సమస్యలను తీసుకెళ్లి న్యాయం చేయాలని కేబుల్ ఆపరేటర్ల సంఘం జెఎసి ప్రతినిధులు కోరారు. నగరంలోని ప్రయివేటు హోటల్‌లో జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ నెట్ సౌకర్యంతో పాటు టెలిఫోన్, టివి, వైఫై సైకర్యం కల్పిస్తూ ట్రిపుల్ ప్లే సౌకర్యం కల్పించిందన్నారు. కేబుల్ ఆపరేటర్లకు ఇచ్చి కేంద్ర ప్రభుత్వ నిధులతో ఒఎల్‌టిలు, ఒఎన్‌యు బాక్సులను ఉచితంగా అందజేశామన్నారు. ఆపరేటర్లకు ఎల్ఎంఒ కోడ్ ఇచ్చి తక్కువ ఛార్జీలతో కనెక్షన్లు మంజూరు చేశామని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఆపరేటర్లకు కోడ్ కావాలంటే రూ.59 వేలు, ఎంఎస్ఒ కోడ్ కోసం రూ.10 లక్షలు, ఆపై జిఎస్‌టి కట్టాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ కొత్త నిబంధనలను అమలు చేస్తే ఆపరేటర్లు ఆస్తులను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అలాగే ఇఎంఐ విధానాన్ని తొలగించి రెంటల్, ప్రీ పెయిడ్ పేరుతో ఇబ్బందుల పాల్జేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలతో పోటీపడి కేబుల్ నడపలేని పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయం మరింత కుంగదీస్తోందన్నారు. అందువల్ల ఆపరేటర్లకు అండగా నిలిచి ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జెఎసి నాయకులు శ్రీనివాసరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

నాట్య కళాకారులకు అభినందనలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఈ నెల 11న శ్రీశైలంలో శ్రీవాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సాంస్కృతి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించనున్న నృత్య పుష్పాంజలికి ఇచ్ఛాపురానికి చెందిన నాట్య కళాకారులు ఎంపికయ్యారని ఆర్గనైజర్ బి.నరేంద్ర, అకాడమీ చైర్మన్ కె.గోవిందరావు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. నాట్య గురువు లొట్టి దివ్య, కర్నం కుమార్. బత్తిన నాయని, బాగ భవాని, పాలెపు వర్శిత, తోట ఉషారాణిలు పాల్గొంటారని అన్నారు. వీరికి కోశాధికారి మంగి దలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పోలాకి : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

కవిటి : మాట్లాడుతున్న శేఖర్

పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి

పోలాకి: తమ పిల్లల చదువు, ప్రగతిపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రులు శనివారం సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సెలవు రోజుల్లో కూడా ఇంటి వద్ద శ్రద్ధగా చదివేటట్టు చూడాలని కోరారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాలు, మౌలిక వసతులు తదితర అంశాలను తల్లిదండ్రులు పరిశీలించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ బి.జగన్నాథం పాల్గొన్నారు.

తల్లిదండ్రులే మార్గదర్శకులు

కవిటి: ప్రాథమిక దశలో ఉన్న చిన్నారులకు తల్లిదండ్రులే మార్గదృకులని మండల కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్ అన్నారు. కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాల తల్లిదండ్రుల సమావేశం శనివారం పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రారంభంలో విద్యార్థులు తల్లిదండ్రులనే అనుసరిస్తారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు తమ చిన్నారుల భవితకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు నేర్పించిన విద్యకు ఇంటివద్ద తల్లిదండ్రులు తర్ఫీదు ఇస్తే ఆ చిన్నారులు చదువులో చురుకుగా ఉంటారని అన్నారు. చిన్నారులపై టివి, మొబైల్ ఫోన్ల ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందని, తల్లిదండ్రులుగా మనం వాటి దుష్ఫలితాలు చిన్నారులకు అర్థమయ్యేలా వివరించి పిల్లలను వాటికి దూరం చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు బిందుమాధవి, పిఆర్‌ఒ రమేష్ పాల్గొన్నారు.

యువత నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

యువత అన్ని రంగాల్లో నైపుణ్యతలను సొంతం చేసుకున్నప్పుడే దేశ భవిష్యత్ సాంకేతికంగా బలపడుతుందని ఉన్నత విద్యా మండలి రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. ఐఎస్‌టిఇ ఎపి సెక్షన్, ఐతమ్ నిర్వహించిన 2001 వార్షిక ఐఎంయి బహుమతుల ప్రధానోత్సవంలో శనివారం ముఖ్యఅతిదిగా పాల్గొని మాట్లాడారు. మెకానికల్, ఇఇఇ, సివిల్ వంటి కోర్సులకు ఆదరణ తగ్గి కంప్యూటర్ సైన్స వైపు ఆసక్తి పెంచుకుంటున్నారన్నారు. ఈ పరిణామం ఎంతో కాలం ఉండదని అన్నారు. ఉత్పత్తి రంగం కుంటుపడితే ఉద్యోగ, ఉపాది అవకాశాలు తగ్గిపోతాయని, రానున్న దశాబ్ద కాలంలో ఉత్పత్తి రంగానిదే పైచేయి అవుతుందని చెప్పారు. అత్యధిక యువ శక్తి ఉన్న భారత్ వంటి దేశాలకు ఉత్పత్తి రంగం ఎంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఒకే వ్యక్తి అనేక రంగాల్లో నైపుణ్యతలను సాధించాలని, అప్పుడే ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఐఎస్‌టిఇ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్ సింగ్ కాకా సాహెబ్ దేశాయ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అధ్యాపకులకు, విద్యార్థులకు శిక్షణిచ్చే అతిపెద్ద సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. అనంతపురం వైస్ ఛాన్సర్ జి.రంగ జనార్ధన, కెఎలు వైసఛాన్సలర్ ఎపి సెక్షన్ ఐఎస్‌టిఇ అధ్యక్షులు సారధివర్మ, సెక్రటరీ ఈశ్వరరెడ్డి సాంకేతిక విద్య ప్రాధాన్యతను వివరించారు. ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ అధిక సంఖ్యలో ఐతమ్ అధ్యాపకులు ఐఎస్‌టిఇలో సభ్యులుగా చేశారని, గతంలో ఉత్తమ విద్యార్థి అవార్డుకు ఎంపికయ్యామని, ఇప్పుడు మూడోసారి ఐతమ్ వేదిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బీలా సత్యన్నారాయణ 2021 ఏడాది జీవిత కాల సాఫల్య అవార్డుకు ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు. సమావేశంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, సభ్యులు రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సదస్సు కన్వీనర్ డాక్టర్ జి.నాగేశ్వరరావు, కో-కన్వీనర్లు డాక్టర్ బి.రమేష్‌నాయుడు, డాక్టర్ శ్రీనివాస ఆచార్యులు, డీన్లు, హెచ్‌డిలు పాల్గొన్నారు.

వరి పంటలు పరిశీలన

కోటబొమ్మాళి: మాండూస్ తుపాను కారణంగా శుక్రవారం సాయంత్రం నుంచి గాలి వీచడం, తేలికపాటి వర్షం వల్ల మండలంలోని ఊడికలపాడులో వరి చేలు నేలకొరిగాయి. విషయం తెలుసుకున్న చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, అప్పలస్వామిలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యవసాయ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. తడిసిన ధాన్యం కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అలాగే మండలంలోని గంగరాం, బంజీరుపేట, సౌడాం, పొడుగుపాడు, హరిశ్చంద్రపురం గ్రామాల్లో పండించిన వరిసాగు నెలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పలస్వామి

రూ.25వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి - పలాస

పలాస ప్రాంతానికి చెందిన ప్రసాద్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న ఎస్‌పివి గ్రూప్ సంస్థ చైర్మన్ తమలంపూడి శ్రీనివాస్‌రెడ్డి తన వంతుగా రూ.16 వేలు, అయ్యప్పస్వాములు రూ.9 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని త్రినేత్ర సన్నిధానం గురుస్వామి ఓం ప్రకాష్ సన్నిధానంలో శనివారంఅందజేశారు. కార్యక్రమంలో మన్యాల శ్రీనివాస్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి - ఆమదాలవలస

పురపాలక సంఘ 2వ వార్డు పరిధిలోని కృష్ణాపురం కూడలి వద్ద రాజులమ్మ తల్లి డాక్టర్స్ ప్లాజా ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు 200 మంది రోగులకు డాక్టర్ కన్సల్టేషన్, ఇసిజి, 2డి ఎకోతో వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి హెల్ప్ డెస్క్ పేరుతో సరికొత్త విధానంను అమలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ విధానం ద్వారా వైద్యానికి కేటాయించే సమయం, శ్రమ, ఖర్చు తగ్గుతాయని అన్నారు. ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి అవగాహన లేని వారికి ఈ డెస్క్ మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. భవిషత్‌లో మరిన్ని సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అన్నెపు సంతోష్, కూన సన్నీ, సంపదరావు నాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్య సిబ్బంది

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మాపురంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాజోగులు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన 462 మంది రోగులకు ఇసిజి, సుగర్ తదితర వైద్య పరీక్షలను వైద్యాధికారులు మణికంఠ, డాక్టర్ సమీర్ డాక్టర్ నితిన్ డాక్టర్ గోవింద్ అందజేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, ఎంపిటిసిలు ఉర్లన హంసమ్మ, ఋషి, సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, ఎస్.గౌరి, రంగారావు, బి.తేజారావు, నూకరాజు, కోటేష్, ఢిల్లీరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆర్‌బికె పరిశీలన

కంచిలి: రైతులు రైతు భరోసా కేంద్రాలను ఉపయోగించుకోవాలని పలాస ఆర్‌డిఒ సీతారామ్మూర్తి కోరారు. మండలంలోని డి.జి.పురం రైతు భరోసా కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో, రైతులతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెస్ పల్లి పంచాయతీలోని నారాయణబట్టిలో రైతులతో మాట్లాడారు. కళ్లాల్లోని ధాన్యాన్ని నేరుగా రైతు భరోసా కేంద్రాలకు తరలించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ హైమావతి, ఎఒ ధనంజయ, ఆర్‌బికె చైర్మన్ లడ్డు కేశవ్ పాత్రో, రైతులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

జీవామృతంతో నేల సారవంతం

ఆమదాలవలస: జీవామృతంతో నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ యాంకర్ నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన రైతులు సామూహికంగా 600 లీటర్ల ద్రవ జీవామృతాన్ని శనివారం తయారు చేశారు. ద్రవ జీవామృతంతో నేల బాగా సారవంతంగా మారుతుందని, అలాగే పంటకు కావాల్సిన పోషకాలన్నీ పుష్కలంగా నేలలో వృద్ధి చెందుతాయని తెలిపారు. జవజీవామృతాన్ని పంటలకు ఉపయోగించడంతో ఎటువంటి ఎరువులు పంటకు అవసరం లేకుండా పంటలు దిగుబడి అధికంగా వస్తాయని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లేశ్వరరావు, కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి రామారావు

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

బూర్జ: గ్రామ పంచాయతీల అభివృద్ధికి 2023–24కు సంబంధించి నిధుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్‌టిసి బజ్జీపురం రామారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్యం, పారిశుధ్యం వంటి అనేక పనులపై త్వరలో ప్రణాళికలు సిద్ధం చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారి ధర్మారావు, ఎంపిడిఒ సురేష్ కిమార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు కె.నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కరణం కృష్ణంనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

పొందూరు: పొందూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ పరిధిలో ఇటీవల అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలకు ఆదివారం ఎస్‌ఇబి స్టేషన్‌లో బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు సిఐ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఇబి జాయింట్ డైరెక్టర్, అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాలు మేరకు ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ వేలం పాటలో ఒక సైకిల్, రెండు ద్విచక్రవాహనాలను బహిరంగ వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు తగు ధరావత్తు చెల్లించి వాహనాల వేలంలో పాల్గొనాలని కోరారు.

జ్ఞాపికను అందస్తున్న హెచ్‌ఎం

విశాల్‌కు అభినందనలు

టెక్కలి రూరల్: విజయవాడ భారతీయ విజ్ఞాన మండలిలో ఎపిఇఎస్‌టి ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి కౌశల్–2022 పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలో మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కె.విశాల్ పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించారు. ఈ మేకు ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. అదేవిధంగా అజాద్ అమృత్ మహోత్సవ విభాగం పోటీపడి ప్రథమస్థానంలో నిలిచారు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదమని తెలిసినా...

బస్సు టాప్‌పై కూర్చున్న విద్యార్థులు

ప్రజాశక్తి– కోటబొమ్మాళి

అధిక ప్రయాణమని తెలిసినా అటు విద్యార్థులు, ఇటు ప్రయాణికులు ప్రయాణం చేయక తప్పడం లేదు. మండలంలోని కొత్తపేట కూడలి నుంచి అటు నరసన్నపేట, శ్రీకాకుళం, ఇటు టెక్కలి, పలాస, అలాగే గ్రామీణ ప్రాంతాలకు స్కూళ్లు, కాలేజీ విద్యార్థులు, ప్రయాణికులు వెళ్తుంటారు. అయితే స్కూళ్లు, కాలేజీల సమయంలో ఆర్‌టిసి బస్సుల సౌకర్యం లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. రోజూ పాఠశాలలకు, కాలేజ్‌లకు సమయానికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గంటకో, రెండు గంటలకో ఒక బస్సు వస్తే, విద్యార్థులందరూ అదే బస్సు ఎక్కడం, అప్పటికే అ బస్సు ప్రయాణికులతో నిండి ఉండటంతో వేలాడుతూ, కొన్నిసార్లు టాప్ ఎక్కి ప్రయాణించాల్సి వస్తోంది. ప్రమాదమని తెలిసినా గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో ప్రయాణిస్తున్నామని విద్యార్థులు వాపోతున్నారు. బస్సు టాప్‌పైన, ఫుట్‌పాత్‌పైన ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా... సమయానికి విద్యా సంస్థలకు చేరుకోలేమని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నామని అన్నారు. ముఖ్యంగా మహిళ విదార్థులైతే రోజూ నరకయాతన పడుతూ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. కరోనా సమయంలో పల్లెవెలుగు బస్సులను తీసేశారని, తరువాత కూడా కొనసాగించలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంపై ఆర్‌టిసి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కళాశాల సమయాల్లో ఆర్‌టిసి బస్సులను నడపాలని విద్యార్థులు కోరుతున్నారు.

కొత్తపేట కూడలిలో కిక్కిరిసిన బస్సును ఎక్కుతున్న విద్యార్థులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

సోంపేట : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

నగరంలో ట్రాఫిక్ నిబంధనలు వాహనదారులు కచ్చితంగా పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మణరావు హెచ్చరించారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు అవగహన కల్పించారు. వాహనాలకు గతంలో విధించిన అపరాధ రుసుం చెల్లించే విధంగా చర్యలు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న చలానాలు వెంటనే చెల్లించాలని వాహనదారులకు సూచించారు. ముగ్గురు ప్రయాణం, సెల్ ఫోన్‌తో డ్రైవింగ్, రైడింగ్ బైక్‌లతో హల్ చేస్తున్న యువతకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

ఆటోల్లో అపరిచితులు ప్రయాణిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని డ్రైవర్లకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ యోగి, నాగరాజు. కానిస్టేబుల్ మురళీకృష్ణ, లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని పాలవలసలో బారువ ఎస్ఐ వి.సత్యనారాయణ రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

జి.సిగడాం : జి.సిగడాం, ఎస్.పి.పురం గ్రామాల్లో ఎస్ఐ సామంతుల రామారావు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

పలాస: టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని నాయకులు బడ్డ నాగరాజు అన్నారు. మున్సిపాలిటీ 7వ వార్డు చినబాడాంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను, అసమర్థతను పాలనాను ప్రజలకు వివరించారు. ప్రజల వద్ద నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గాలి కృష్ణారావు, గురిటీ సూర్యనారాయణ, గోళ్ల చంద్రరావు, కొవ్వూరు సురేష్, హనుమంతు మురళి, నాబిల్లి శ్రీను, బేపల సంతోష్, గిన్ని సింహాచలం, రమణ ప్రధాన్, కొత్త సత్యం, చెల్లూరు రామకృష్ణ, ఉమాకాంత్, హెచ్.జోగారావు, వంకల జానకిరావు పాల్గొన్నారు.

మందస : మండలంలోని చీపి పంచాయతీలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, ఐటిడిపి మండల కన్వీనర్ తలగాన రాజశేఖర్, తామాడ ధర్మారావు, చీపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సవర కోదండరావు, సవర ఈశ్వరరావు, సవర చైతన్య పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని దేవునల్తాడలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, ఉపాధ్యక్షులు అరసపల్లి ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి సూళ్ల చిట్టిబాబు, దాసరి జే.జే.రావు, సైని బాలాజీ, యువత అధ్యక్షుడు మరడ దుర్యోధన, అంబటి రామకృష్ణ, బొండడా కేశవరావు, కాస పాపారావు తులే అప్పోజి, తులే కృష్ణారావు పాల్గొన్నారు.

జి.సిగడాం : ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

జి.సిగడాం : మండలంలోని పిసిని వలస పంచాయతీ సర్వేశ్వరపురంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిమిడి రామ్‌మాలిక్ నాయుడు, మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, ఉపాధ్యక్షుడు బుజ్జి, సీనియర్ నాయకులు కిల్లాన చెందు, రాజు, బంగారునాయుడు, టంకాల మౌళీశ్వరరావు, కూర్మారావు, మజ్జి హరి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న సిఐ సతీష్‌కుమార్

ఇచ్ఛాపురం : ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకుంటే ప్రశ్నించే తత్వం వస్తుందని సిఐ సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక శాంతి నికేతన్ విద్యా సంస్థలో అంతర్జాతీయ మానవ హక్కులు దినోత్సవం వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంస్థల చైర్మన, మానవ హక్కుల కమిషన్ నియోజకవర్గ అధ్యఒఉలు దక్కత కృష్ణమూర్తిరెడ్డి మానవ హక్కులు సంఘం ఏర్పాటుపై వివరించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు గోవిందరావు, కె.రామకృష్ణ, కమిషన్ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు. అనంతరం ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కె.సి.పూరి, ఎస్.చిరంజీవి, ఎస్.తులసీరావు, సురేఖ సునీత, పద్మజ పాల్గొన్నారు.

సోంపేట : సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యాన మానవహారం చేపట్టారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎన్ఎస్–ఎస్ పిఒ రామినాయుడు తెలిపారు. జీవించడం, మాట్లాడడం మన హక్కు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.ప్రసాద్, టి.హరిప్రసాద్, టి.ప్రవీణ్ పాల్గొన్నారు.

సోంపేట : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

దళారులను నమ్మవద్దు

ప్రజాశక్తి– పొందూరు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి దళారుల మాటలను నమ్మి మోసపోవద్దని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కొంచాడలో తహశీల్దార్ గణపతిరావు ఆదేశాలు మేరకు శనివారం ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. తడిసిన ధాన్యాన్నీ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ఈయనతో పాటు విఆర్‌ఒలు రేవతిరావు, అసిరయ్య ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ ఈశ్వరరావు

నేడు వన భోజనం

రణస్థలం : బంటుపల్లి సమీపంలోని బీరు పరిశ్రమ పక్కన ఉన్న తోటలో ఆదివారం వనభోజనాలు నిర్వహిస్తున్నామని, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కిరణ్ యువసేన సభ్యులు, మీడియా ప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొవాలని కోరారు.

జలుమూరు : రగ్గులను అందజేస్తున్న సభ్యులు

దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి– పలాస

ఆంధ్రా–ఒడిషా సరిహద్దు ప్రాంతం మందస మండలం మహేంద్రగిరి సమీపం బిత్రబంధలో శనివారం గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యాన మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని నిరుపేద గిరిజన వృద్ధులకు, చిన్నారులకు దుస్తులు, మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనాల గోపాలరావు, గౌరవ అధ్యక్షులు బత్తిని ఓంకార్ మాస్టర్, మొక్కల ప్రేమికులు కొత్తపల్లి చిన్నారి, ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్ మాస్టర్, తిమడాన శంకర్రావు, గిరిజన నాయకులు సగర ధర్మారావు, సవర చిన్నబాబు, గ్రీన్‌ఆర్మీ కార్యదర్శి బందాపు తిరుమల పాల్గొన్నారు.

రగ్గులు..

జలుమూరు: మండలంలోని మర్రివలసలో ఉపహార స్టూడెంట్ కేర్ సెంటర్ లో 260 మంది పేద విద్యార్థులకు ఉచితంగా స్వెటర్లు, చెప్పులు పంపిణీ చేసినట్లు ప్రాజెక్టు మేనేజర్ టి.లక్ష్మణ్ జాషువా తెలిపారు. పేద విద్యార్థుల భవిష్యత్తే ధ్యేయంగా ఉపహార్ సంస్థ పనిచేస్తోందని, ఇందులో భాగంగానే పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, స్వెటర్లు, చెప్పులు తదితర వస్తువులు అందజేస్తున్నామని తెలిపారు. ఈయనతో పాటు ఎస్.కె.దీప్, ఉపహార్ సంస్థ సభ్యులు ఉన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న గిరిబాబు

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి– పలాస

రోడ్డు పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కాంట్రాక్టర్‌కు, అధికారులకు ఆదేశించారు. పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలోని ఆరో వార్డులోని పెసరపాడులో రూ.32 లక్షలతో నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థులు ఎన్నో దశాబ్దాల కళ నెరవేరబోతుందని, త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేసి ఆయా ప్రాంతాలకు కానుకగా ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, డబ్బీరు నాగు, బడగల మధు, రోడ్ కాంట్రాక్టు వాసు పాల్గొన్నారు.

లావేరు హాస్టల్ వార్డెన్‌గా రమేష్‌బాబు

లావేరు : లావేరు బిసి హాస్టల్ వార్డెన్‌గా జోషుల రమేష్‌బాబు బదిలీపై వచ్చారు. దీంతో శనివారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ ఇంతవరకు వార్డెన్‌గా పనిచేసిన కె.పాపారావును రణస్థలం మండలంలోని కొవ్వాడ బిసి హాస్టల్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేసిన రమేష్‌బాబును లావేరు హాస్టల్‌కు బదిలీ చేశారు.

రామమల్లిక్ నాయుడు పరామర్శ

జి.సిగడాం : మండలంలోని పెనసాంకు చెందిన ఈశ్వరరావు, సంతోష్ భవానీ మాలధారణలో విజయవాడ పాదయాత్ర వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు మృతుల కుటుంబ సభ్యులు శనివారం పరామర్శించారు. ఈయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్ తదితరులు ఉన్నారు.

బ్యాంకు అకౌంట్ తప్పనిసరి

ప్రజాశక్తి– సోంపేట

ప్రతిఒక్కరూ బ్యాంకు అకౌంట్లు కలిగి ఉండాలని, అందుకోసమే జీరో అకౌంట్లను ప్రోత్సహిస్తున్నామని సోంపేట ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ జి.రవికుమార్ అన్నారు. మండలంలోని పలాసపురంలో శనివారం స్థానికలతో జీరో అకౌంట్లను ప్రారంభించారు. ప్రస్తుతం అన్ని లావాదేవీలకు బ్యాంకు ఖాతాలు తప్పనిసరి అవుతుందని, ప్రతిఒక్కరితో ఎకౌంట్లను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.